క్లుప్తంగా

పశువుల ప్రాణాలు తీస్తున్నాయ్..



కుక్కల దాడిలో మృతి చెందిన ఆవుదూడ

గోకవరం: వీధి కుక్కలు పశువుల ప్రాణాలు తీస్తున్న పంచాయితీ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో శనివారం రాత్రి రాటకు కట్టిఉన్న ఆవులపై వీధి కుక్కలు దాడిచేయడంతో ఆవు దూడ చనిపోగా, మరో రెండు ఆవులకు తీవ్ర గాయాలయ్యాయి. పశువులపైనే కాకుండా రాత్రి సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్తున్న స్థానికులపైన ఉరికించి కరుస్తున్నాయని పలువురు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల కాలంలో కుక్కల సంచారం ఎక్కువైందని దీనిపై సంబంధిత అధికారులు స్పందించి వాటి బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అన్నసమారాధనలు

కిర్లంపూడి: మండలంలోని పలు ఆలయాలు వద్ద ఆదివారం భారీ అన్నసమారాధనలను భక్తులు నిర్వహించారు. జగపతినగరం–సింహాద్రిపురం అడ్డురోడ్డులో వేంచేసియున్న సత్తెమ్మతల్లి, రాజుపాలెంలోని ఆంజనేయస్వామి వారి ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు. స్థానిక పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

కత్తిపూడిలో కిసాన్ మోర్చా సమావేశం

ప్రత్తిపాడు: శంఖవరం మండలం కత్తిపూడి హైస్కూల్ రోడ్డులోని వర్తక వాణిజ్య కల్యాణ మండపం ఆవరణలో ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం 3.గంటలకు బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం జరుగుతుందని కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బంగారు వెంకటరమణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు శింగిలిదేవి సత్తిరాజు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార్ స్వామి ముఖ్య అతిధిగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరాజు, రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశాన్ని బీజేపీ రాష్ట్ర, జిల్లా పదాధికారులు, కార్యవర్గ సభ్యులు, కిసాన్ మోర్చా మండల కమిటి అధ్యక్షులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

దేశభక్తి కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న వద్దాది శ్రీనివాసరావు

తుని: ప్రతీ భారతీయ పౌరుడు దేశభక్తి కలిగి ఉండాలని ఆర్ఎస్ఎస్ సమాలోచన సంయోజక్ వద్దాది సుబ్బారావు అన్నారు. స్థానిక గణపతినగర్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్ఎస్ఎస్) తుని ఖండ్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రారంభిక శిక్షావర్గ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న వద్దాది సుబ్బారావు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ నిర్వహించే శిక్షవర్గతో అనేకమంది భారతీయులు దేశభక్తిని అలవర్చుకుంటున్నారన్నారు. ప్రతీ పౌరుడు దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. ఆర్ఎస్ఎస్ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ వికాశ్ సంయోజక్ చదరం నరసింగరావు, మునగాల ఉదయ్‌కుమార్, కుందెం సత్యన్నారాయణ, గేలం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు పట్టించుకోరా..?



కె సూరంపాలెం 1వ వార్డులో పోల్ చుట్టూ అలుముకున్న మొక్కలు, తీగలు

గండేపల్లి: ప్రమాదం జరిగాక హడావిడిగా పరుగులు పెట్టి, అప్పుడు సమస్యను పరిష్కరించే అధికారులు ముందుగానే ప్రమాదం జరగకుండా సమస్యను పరిష్కరించవచ్చు కదా..అని గ్రామస్తులు మొరపెట్టుకుంటున్నారు. మండలంలోని కె.సూరంపాలెం 1వ వార్డులో రహదారికి పక్కనే ఉన్న విద్యుత్ పోల్ చుట్టూ మొక్కలు అలుముకున్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాలులేవని స్థానికులు చెబుతున్నారు. తుఫాన్ ప్రభావంతో వారం రోజులుగా వర్షం కురుస్తున్నందున విద్యుత్ సరఫరా అయి ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతన్నా..జాగ్రత్త

- విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి
- కొనుగోలు చేసేటప్పుడు రశీదు తప్పనిసరి



విత్తనాలు వేసేందుకు పొలంలో దుక్కి చేసి సిద్ధంగా ఉంచిన రైతులు

కిర్లంపూడి: ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండటంతో రైతులు పొలం పనులకు సమాయత్తమవుతున్నారు. పంట దిగుబడి చేతికి అందివచ్చే వరకు ప్రతి రోజు పొలంలో ఏదో ఒక పనిచేస్తునే ఉంటారు. రానున్న జూన్ నుంచి ఖరీఫ్ సాగుకు విత్తనాలు చల్లే పనులు ప్రారంభమవుతాయి. ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే పలకరించే అవకాశం ఉండటంతో రైతులు పనులకు ముందుగానే శ్రీకారం చుట్టారు. రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలు అంటగట్టి అందినంత దోచుకునేందుకు అదునుగా ఎదురుచూస్తున్నారు. వీరి బారిన పడకుండా ఉండాలంటే రైతులు విత్తనాల నాణ్యతపై అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే వ్యాపారులు చేస్తున్న అక్రమాలను గుర్తించి వారిని నిలదీసే అవకాశం ఉంటుందని అధికారులు చేబుతున్నారు.

అన్నింటా మోసం

విత్తనాలు కోనుగోలు చేసి పొలంలో వేసుకున్న తరువాత మొలకలు పూర్తిగా రాకపోవడం, తక్కువ శాతం మొలకెత్తితే నాశిరకం విత్తనాలతో వ్యాపారి తనను మోసం చేశారని రైతులు భావిస్తారు. ఒక్క విత్తనాలే అనుకుంటే పొరపాటే. విత్తనాలతో పాటు ఎరువులు, పురుగుల మందులలో కూడా కల్తీలు జరిగే అవకాశం ఉంటుంది.

పరిశీలన తప్పనిసరి..

ప్రభుత్వ అనుమతి పొంది వ్యాపారం చేస్తున్న డీలర్ వద్దనే విత్తనాలు కనుగోలు చేయాలి. రశీదులు (బిల్లులు) ఇవ్వని దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేయకపోవడమే మంచిది. కొనుగోలు చేసిన విత్తనాల సంచుల(బ్యాగ్)కు సీల్ వేసి ఉన్నాయో? లేదో? చూసుకోవాలి. సీల్ వేసి ఉన్న సంచులనే కొనుగోలు చేయాలి. సంచులపై కంపెనీ పేరు, తయారీ, గడువు తేదీలు, నికర బరువు, విత్తన రకం, తేమ శాతం.... తదితర అంశాలను సరిచూసుకోవాలి.

పొలంలో విత్తనాలు చేసుకున్న తరువాత సంచులను, రశీదులను, సంచులపై ఉన్న సమగ్ర వివరాలను తెలియజేసే పత్రాలను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. విత్తనాలు కొనుగోలు సమయంలో మోసం జరిగితే వినియోగదారుల చట్టం ప్రకారం పరిహారం పొందేందుకు ఇవే కీలకమవుతాయి.

నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించినట్లు వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్తే ఆ ఫెర్టిలేజర్ షాపు యజమానులుపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పొలంలో వేసిన విత్తనాలకు మొలకలు రాకపోతే నకిలీ విత్తనాలుగా భావించాలి. దిగుబడి పూర్తిగా రాకపోయినా నకిలీ విత్తనాలుగానే భావించవచ్చు. అలా జరిగితే వెంటనే వ్యవసాయ శాఖ ఏఓ, ఏడీ, పోలీసులకు అన్ని రకాల రశీదులతో రైతుకు జరిగిన నష్టాన్ని, విత్తనాలు ఎక్కడ కొనుగోలు చేశారో తెలియజేస్తూ ఫిర్యాదు చేయడానికి సదరు వ్యాపరస్తుడు ఇచ్చిన రశీదును భద్రపరుచుకోవాలి. పంటను పరిశీలించి ధ్రువీకరించేందుకు శాస్త్రవేత్తలను అధికారులు తీసుకొస్తారు. పోలీసుల, వ్యవసాయాధికారులు ఇచ్చిన నివేదికల మేరకు వినియోగదారుల ఫోరంలో కేసు వేస్తే రైతులకు న్యాయం జరుగుతుంది.



వరి విత్తనాల బస్తాలు

కఠిన చర్యలు తప్పవు



ఖరీఫ్ సీజన్‌లో రైతులకు షాపు యజమానులు నకిలీ విత్తనాలు విక్రయించనట్లు తమ దృష్టికి వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోంటాము. రైతులు తీసుకున్న విత్తనాలకు 80 శాతం మొలకలు రాకపోతే వాటిని నకిలీ విత్తనాలుగా భావించాలి. ప్రైవేట్ వ్యక్తుల నుంచి విత్తనాలు కొనుగోలు చేసే కన్నా రైతులు ముందుగా పండించిన వరి పంట ధాన్యం నిలువ చేసుకుని వాటినే విత్తనాలు వినియోగించుకోంటే కొంత మేర నకిలీకి తావులేకుండా ఉంటుంది.

– జోకా అమృత, వ్యవసాయాధికారి, కిర్లంపూడి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఏలేశ్వరంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఏలేశ్వరం: ఒకటి, రెండు కాదు ఏకంగా ఐదేళ్లు కలిసి చదువుకున్నారు. నాలుగురోజులు పరిచయమైతే మరిచిపోలేని రోజులు అలాంటి ఐదేళ్లు కలిసి ఉండడంతో వారి మధ్య ఎన్ని అనుబంధాలు ఉన్నాయో వాటిని నెమరువేసుకోవడమే సరిపోయింది రోజంతా. అప్పట్లో చేసిన అల్లరిచేష్టలు, చిలిపి పనులు గుర్తు చేసుకున్నారు. ఏలేశ్వరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998–2003 వరకు చదువుకున్నా విద్యార్థులంతా 22 ఏళ్ల తరువాత ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. అప్పటి రోజులు తలచుకుని భావోద్వేగానికి గురయ్యారు. అప్పట్లో తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించి తమ ప్రేమాభిమానాలు చాటుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పాజీ, జ్యోతిరాజు, రమణకుమారి, ఆచార్యులు, విద్యార్థులు అప్పారావు, వెంకటలక్ష్మి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలి



ఎన్.ఎన్ పట్టణంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ గిరిబాబు

రౌతులపూడి: దేవునిపై భక్తిశ్రద్ధలతో మెలగి, ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గ్రామస్తులు ఆహ్వానం మేరకు ఆయన ఆదివారం మండలంలోని ఎన్.ఎన్ పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆంజనేయస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆంజనేయస్వామి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. స్థానిక సర్పంచ్ సింగంపల్లి వెంకటలక్ష్మి, మండల పార్టీ బీసీ విభాగం అధ్యక్షుడు సింగంపల్లి చిట్టిబాబు దంపతులు ఆయనను సత్కరించారు. గత కొన్నేళ్లుగా చిట్టిబాబు దంపతులు గ్రామానికి చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. తమపై చూపిస్తున్న ప్రేమాభిమానాలను మరువలేనివని, ప్రజలకు ఏకష్టమొచ్చినా తమ కుటంభం అండగా ఉంటుందన్నారు. మార్గ మధ్యలో లచ్చిరెడ్డిపాలెం, బీబీ పట్టణం గ్రామాల నేతలు కలసి తమ ఆత్మీయతను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, వైఎస్సార్ సీపీ నేత వాసిరెడ్డి జమీలు, మండల పార్టీ కన్వీనర్ సీహెచ్ వీవీ సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాల్యంలోనే అవగాహన అవసరం



ధర్మవరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: హిందూ.సంస్కృతి, సంప్రదాయాలపై బాల్యంలోనే పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామిజీ, వాకపల్లి కాళీ లక్ష్మీప్రసన్న ఆనంద మాతాజీ అన్నారు. మండలంలోని ధర్మవరంలో ఆదివారం అన్నమయ్య కళాక్షేత్రం జిల్లా అధ్యక్షుడు సానా సూకరాజు నాయుడు ఆధ్వర్యంలో చిన్నారుల సర్వోతోముఖ వికాస తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం గ్రామంలోని దేవాలయాల్లో అవగాహన కల్పించి మంత్ర ఉపదేశం చేశారు. పిల్లల్లో చిన్ననాటి నుంచి ఆధ్యాత్మిక చింతన అలవర్చాలన్నారు. గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, అన్నమయ్య కళాక్షేత్ర జిల్లా సమన్వయకర్త దిడ్డి సునీత, కోనసీమ జిల్లా అధ్యక్షుడు కుంపట్ల బాపనాయుడు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ప్రత్తిపాడు మండలం కన్వీనర్ కడారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

90 మందికి వైద్య పరీక్షలు



తునిలో వాకర్లకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

తుని: స్థానిక గణపతినగర్ పార్కు వద్ద సిటీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో సిటీ వాకర్స్‌క్లబ్, అయోధ్య వాకర్స్ క్లబ్ సభ్యులు 90 మందికి వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య పరంగా సలహాలు, సూచనలు చేశారు. వైద్య పరీక్షలు చేసిన వాకర్లందరికీ అల్లం, వెల్లుల్లి, తేనె కలిపిన కిల్లి అందజేసినట్లు నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు లోకారెడ్డి అప్పారావు, కార్యదర్శి బీ సత్తిబాబు(ప్రిన్స్), నారపురెడ్డి రాజు, మాతిరెడ్డి శివ, కుచ్చర్లపాటి భీమరాజు, బోడిశెట్టి త్రిమూర్తిస్వామి, వాసు, డాక్టర్ ఆదినారాయణ, బీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎగసిపడుతున్న సముద్రం

- అల్పపీడనంతో బంగాళఖాతం అల్లకల్లోలం
- రెండు మీటర్లు వరకూ ఎగసి పడుతున్న అలలు



తొండంగి మండలం దానవాయిపేటలోని తీరంలో ఎగసిపడుతున్న అలలు

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదివారం తీరంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. అద్దరిపేట, దానవాయిపేట, పెరుమాళ్లపురం తదితర సముద్రతీరాల్లో అలలు రెండు మీటర్ల వరకూ ఎగసి పడుతున్నాయి. ప్రస్తుతం వేట నిషేధం అమలులో ఉండటంతో మోటారుబోట్లు తీరంలో ఉన్నాయి. నాటుపడవలపై మాత్రమే వేట నిర్వహించే మత్స్యకారులు ప్రతికూల పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ సాయంత్రం ఆకాశం మేఘావృతమై పలు చోట్ల వర్షం కురిసి వాతావరణం చల్లబడింది. దీనితో పలు గ్రామాల్లోని ఇటుక బట్టీలు మూతపడ్డాయి.

గౌరవం లేదు.. వేతనం ఇవ్వరు

- 19 నెలలుగా ఎంపీటీసీ సభ్యులకు అందని గౌరవ వేతనాలు
- టీడీపీ నాయకులకే ప్రాధాన్యత
- కనీస గౌరవం ఇవ్వడం లేదని ఆవేదన



ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయం

ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్య (ఎంపీటీసీ)లకు గౌరవ వేతనాలు ఇవ్వకుండా వారి సహనాన్ని పరీక్షిస్తోంది. ప్రభుత్వం ప్రతీ ఎంపీటీసీ సభ్యుడికి నెలకు రూ. 3 వేల వంతున గౌరవ వేతనాన్ని చెల్లిస్తోంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రత్తిపాడు మండలంలో 23 మంది, రౌతులపూడి మండలంలో 16 మంది, ఏలేశ్వరం మండలంలో 14 మంది, శంఖవరం మండలంలో 16 మంది వెరసి 69 మంది ఎంపీటీసీలున్నారు. వీరికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దఫదఫాలుగా ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికల కారణంగా గత ప్రభుత్వం ఎంపీటీసీలకు వేతనాలు చెల్లించలేకపోయింది. జూన్ 2025లో కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అంతకు ముందు పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పటి వరకు 19 నెలల నుంచి వేతనాలు రావల్సి ఉందని ఎంపీటీసీ సభ్యులు వాపోతున్నారు. గౌరవ వేతనం మంజూరు చేయకపోవడంతో అధికార పక్షం, విపక్షం ఎంపీటీసీ సభ్యులనే తేడా లేకుండా ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటికైనా తమకు రావాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

గౌరవం ఇవ్వడం లేదు

ప్రజల చేత ఎన్నికైన ప్రజా ప్రతినిధులమైనా ఏమాత్రం గౌరవం ఇవ్వడం లేదని ఎంపీటీసీలు వాపోతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో టీడీపీ నాయకులకు ఇచ్చిన ప్రాధాన్యత తమకు అధికారులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నుంచి సర్వసభ్య సమావేశాలకు హాజరు కావడమే తప్ప తాము ప్రజల సమస్యలను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు. శనివారం జరిగిన ప్రత్తిపాడు మండల సర్వ సభ్య సమావేశంలో పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు చేస్తున్న సంగతి కూడా తెలియపరచడం లేదని, కనీసం గ్రామంలో జరుగుతున్న పనులైనా తమ దృష్టికి తీసుకురాకుండానే ఏకపక్ష నిర్ణయాలతో చేసుకుపోతున్నారని ప్రజాప్రతినిధులు ఆరోపించారు.

ప్రజాప్రతినిధులంటే అంత అలుసా



ప్రజా ప్రతినిధులంటే కూటమి ప్రభుత్వానికి అంత అలుసై పోయామా ఎంపీటీసీ సభ్యులందరూ ఆర్థిక స్థోమత కలిగిన వారిలా ప్రభుత్వం భావిస్తోంది. దాదాపు 20 నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే సభలు, సమావేశాలకు ఎలా రావాలి?

– సీంద్రపు భాస్కరావు, ఎంపీటీసీ, ప్రత్తిపాడు

గౌరవ వేతనం మంజూరు చేయాలి



ఎంపీటీసీలకు కూటమి ప్రభుత్వం గౌరవ వేతనాలు ఇవ్వడం లేదు. సభలు, సమావేశాలకు మండల కేంద్రానికి వచ్చిపోవాలంటే ఖర్చుతో కూడుకున్న పని. కూటమి ప్రభుత్వం స్పందించి, ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు వెంటనే మంజూరు చేయాలి.

గోళ్ల కాంతి సుధాకర్, మండలాధ్యక్షుడు, ప్రత్తిపాడు

11 నెలల గౌరవ వేతనాలు మంజూరు



ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాల బకాయి ఉంది. మండలంలోని ఎంపీటీసీ సభ్యులకు ప్రభుత్వం 11 నెలలకు గౌరవ వేతనాలు మంజూరు చేసింది. సుమారు ఇందుకోసం సుమారు రూ. 9 లక్షల నిధులు విడుదలయ్యాయి. త్వరలో వేతనాలను చెల్లిస్తాం.

– ఎంపీఆర్ కుమార్ బాబు, ఎంపీడీఓ, ప్రత్తిపాడు

కూటమి పాలనలో ఒరిగిందేమీ లేదు



మండల పార్టీ నాయకులతో కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ఒరిగింది ఏమీలేదని వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలో రాచపల్లి, పాదురుపాక గ్రామాల్లో గిరిబాబు పర్యటించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలతో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచి కష్టపడి పనిచెయ్యాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చెయ్యకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. పార్టీ శ్రేణులు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దోచిట్టిబాబు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, సారిపల్లి గంగరాజు, చందక నాని తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రంతోనే ఆరోగ్యం



జి.కొత్తపల్లిలో ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరు ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలోని ఆదివారం పంచాయతీ సిబ్బందితో రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్త,వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికతీత తీయించారు. గ్రామంనలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచకారి చేశారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదుర్గ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

ముగ్గురు జూదరులు అరెస్టు

తుని రూరల్: తుని మండలం లోవకొత్తూరు శివారులో జూదం ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి తెలిపారు. ఆదివారం విశ్వసనీయ మేరకు తమకు అందిన సమాచారంతో దాడి చేశామన్నారు. తనిఖీల్లో నిందితుల నుంచి రూ.ఏడు వేలు నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. మండలంలో జూదాలకు పాల్పడితే అరెస్టు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

రోహిణి కార్తెలో..వర్షాలు



ఏలేశ్వరంలో ఆకాశంలో దట్టంగా అలుముకొన్న కారుమబ్బులు

ఏలేశ్వరం: పట్టణంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ ప్రతాపం చూపగా మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై గాలులతో కూడిన వర్షం పడింది. వర్షానికి వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణ మార్పుల్లో భాగంగా వారం రోజులుగా అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. ఉదయం ఎండలు, సాయంత్రం వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే మొదటివారంలో రుతుపవనాలు సమీపిస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదం చాటున ప్రయాణం



పరిమితికి మించి ప్రయాణం సాగిస్తున్న మినీ వాహనం



మినీ వ్యాన్‌లో ప్రమాదకరంగా లోడు

- ఇష్టారీతిన నిబంధనలు ఉల్లంఘన
- నెత్తురోడుతున్న జాతీయ రహదారి

గండేపల్లి: జాతీయ రహదారిపై ప్రమాదపు అంచున ప్రయాణాలు జరుగుతున్నప్పటికీ అధికార యంత్రాంగం మాత్రం పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారిపై ప్రతి రోజూ ఏదో ఒకచోట చిన్నదో, పెద్దదో ప్రమాదం జరగడం పరిపాటిగా మారింది. పలు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న రహదారి కావడంతో ద్విచక్ర వాహనం దగ్గర నుంచి 160 చక్రాల గల భారీ వాహనాలు ప్రయాణం చేస్తుంటాయి. వీటిలో నిబంధనలు అతిక్రమించిన వాహనాలపై అధికారులు దృష్టిసారించడంలేదనే ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. అధిక లోడు, పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్నప్పటికీ చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కొన్ని వాహనాలు ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తుండటంతో ఇతర వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొవల్సిన పరిస్థితి ఎదురవుతోంది. గండేపల్లి మండలం పరిధిలోని 18 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉండగా జగ్గంపేట, కిర్లంపూడి మండలాల్లో 10 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. వీటిలో గండేపల్లి, జగ్గంపేట పోలీస్ స్టేషన్లు రహదారికి అతి సమీపంలో ఉన్నప్పటికీ వాహనదారులు తమ ప్రయాణాలను ధీమాగానే సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇటువంటి వాహనాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అధిక లోడుతో ప్రయాణిస్తున్న లారీ